# వయసొచ్చింది



దర్జీ జోగారావు కొట్టుముందు ఓ పదేనేళ్ళ కుర్రాడు అలా స్తంభానికి వేలబడి నుంచున్నాడు. జోగారావు కుట్టుపని హడావిడిలో ఉన్నాడు.

ఆ కుర్రాడు అలా వీధిలోకి చూస్తూ వచ్చేపోయే జనాన్ని, దూరంగా ఉన్న జాంపళ్ళబుట్టని, ఆపైన కన్పించే మిఠాయి కొట్టుని పరిశీలనగా చూస్తున్నాడు. జోగారావు మిషను కుడుతూ వాణ్ణి గమనిస్తూనే ఉన్నాడు. కాని పని తొందరలో వాడెవడో పట్టించుకోలేదు.

జోగారావుకి అన్నం వచ్చింది. పని వాళ్ళని భోజనానికి పంపించి తను అన్నం గిన్నె విప్పుతూ చూస్తే ఆ నల్లటి కుర్రాడు ఇంకా అక్కడే భయంగా చూస్తూ కన్పించాడు.

"ఏరా?" అని పిల్చాడు జోగారావు.

"బాబూ" అని ఇటు తిరిగాడు కుర్రాడు.

ఆ కుర్రాడి కళ్ళలో ఆకలి .... కరకరలాడే ఆకలి! కడుపు చుమ్మలు చుట్టుంటే ముఖంమీద కన్నీళ్ళుగా కరిగిపోయే ఆకలి!

జోగారావుకి జాలేసింది. 'ఆకలేస్తంది గదరా!' అన్నాడు.

'హఁయ్య, ముద్దజూసి మూణ్ణాళ్ళయిందయ్యా .....' అన్నాడు స్తంభం కిందికి జారిపోయిన కుర్రాడు.

"ఏడవబోకురా ఎదవా, నాకు పోను అన్నం మిగులుద్ది, అది నువ్వు తిని గిన్నెలు కిష్టకెళ్ళి కడుక్కు తీసుకురా" అన్నాడు జోగారావు.

కుర్రాడి కళ్ళు తళతళమన్నాయి. మిగిలిన అన్నం కిష్ట దగ్గర తిని, కడుపునిండా కిష్టనీళ్ళు తాగి, గిన్నెల్ని రేగడ మట్టితో మెరిసిపోయేట్టు తోమి కొట్టు దగ్గరికి తీసుకొచ్చాడు కుర్రాడు. గిన్నెలు శుభ్రంగా తుడిచి కొట్లో పెడ్తుంటే జోగారా వడిగాడు "నీ పేరేంట్రా?"

"బాబిగాడయ్యా!" అన్నాడు కుర్రాడు.

"ఇహ పో!" అన్నాడు జోగారావు.

బాబిగాడు పోలేదు. పొద్దున్నంతా స్తంభానికానుకుని బజారంతా చూస్తున్నవాడు ఇప్పుడు స్తంభాని కానుకుని కొట్టువంకే చూస్తూ నుంచున్నాడు. సాయంత్రమైంది. జోగారావు కుట్టిన గుడ్డలు వూళ్ళోవాళ్ళ కివ్వడానికి వెళ్తూ మళ్ళీ బాబిగాణ్ని చూశాడు. "ఏరా! నువ్వు పోలా?" నవ్వుతూ అన్నాడు.

"హఁయ్య ...."అన్నాడు బాబిగాడు. వాడి ముఖం "ఆదుకో దేవుడా!" అంటోంది. వాడి కళ్ళు వేడుకుంటున్నాయి.

జోగారావు కేవనిపించిందో "ఒరేయ్!- ఈ బట్టలు తీసుకు నా వెనకాలే రా వూళ్ళో ఇచ్చొద్దాం' అన్నాడు.

బాబిగాడు చెంగున ఎగిరి బట్టలు నెత్తిన పెట్టుకుని జోగారావు వెనకాలే నడిచాడు.

ఆ రోజునుంచి బాబిగాడు పొద్దున్నే కొట్టు తియ్యక ముందే దర్జీ దుకాణం దగ్గర ఉండేవాడు. కొలతలు తీసుకుంటున్నప్పుడు టేపు అందివ్వడం, రాసుకోటానికి పుస్తకం, కత్తిరింపుకు కత్తెర్లు అందించడం, మిషనుకి ఆయిల్వేయటం మధ్య మధ్యలో టీలు, బీడీలు తెచ్చి పెట్టడం, మధ్యాహ్నాం జోగారావుకి అన్నం తెచ్చి పెట్టి మిగిలింది తిని గిన్నెలు కడిగివ్వటం, ఊళ్ళోకి జోగారావు బట్టలకి కొలతలకి వెళ్ళినా కుట్టిన బట్టలివ్వటానికి వెళ్ళినా వెనకాతలే వెళ్ళటం, కొట్టు మూశాక కిష్టవొడ్డుకొచ్చి కడుపునిండా నీళ్లు తాగి రాత్రి మంటపంలో పడుకోవటం - ఇదీ బాబిగాడి నిత్యకృత్యం.

జోగారావుకి బాబిగాడు నచ్చాడు. ఆర్నెల్లు గడిచాయి. వచ్చిన గుడ్డల్లో మిగిలిన బట్టతో బాబిగాడికి ఓ చొక్కా నిక్కరు కుట్టించి యిచ్చాడు. గుండీలకి కాజాలు తీయటం కూడా నేర్పుతున్నాడు.

బాబిగాడు ఓ రోజు కిష్ట దగ్గరికి ఆలస్యంగా వచ్చి దోసెడు నీళ్ళు తాగి 'బేవ్' మని తేన్చి పక్కకి చూస్తే ఓ పధ్నాలుగేళ్ళ పిల్ల తనవైపు వింతగా చూస్తుండటం కన్పించింది. ఆ పిల్లే పలకరించింది "ఇయ్యాల్టికి నీల్లే అన్నవా?"

"ఆర్నెల్ల నించీ ఇంతే"

"ఇయ్యాళ ముద్ద తిందువురా"

"మరి నీకో!"

"నాకు సరిపోద్దిలే!"

బాబిగాడు ఆ పిల్ల దగ్గరకెళ్ళాడు. చింతచిగురు పప్పు కలిపి ముద్ద బాబిగాడి చేతిలో పెట్టింది,

"నీ పేరేందో?" అడిగాడు బాబిగాడు.

"పోలి, నువ్వో?"' అంది పోలి.

"బాబిగాడ్ని, జోగారావయ్య దర్జీ కొట్లో పని."

"ఏవూరు?"

"ఇప్పటి కీవూరే. అయ్యా అమ్మా లేరు."

"నాకూ లేరు. ఓ ముసలి తాతున్నాడు. అంట్లు తోమి, పాసిపని జేస్తే మా పొట్టెల్లిపోద్ది."

అదేం చిత్రమో బాబిగాడు, పోలి ఎంతో కాలంనుంచీ ఒకళ్ళ కొకళ్ళు తెలుసున్నట్లు కష్టసుఖాలు మాట్లాడుకున్నారు. నల్లటి ముఖంలో చేపపిల్లలా మెరుస్తున్న పోలికళ్ళు చూసి బాబిగాడు సంబరపడి పోతున్నాడు. ఉన్న అన్నమంతా బాబిగాడికే పెడ్తూ తను తిన్నట్లే ఆనందపడిపోతోంది పోలి.

రోజూ కిష్ట వొడ్డున కలుసుకునేవాళ్ళిద్దరూ. పదిరోజులు పోయాక బాబిగాడన్నాడు. 'పోలీ, నన్ను మావా అని పిలవరాదంటే?"

పోలి వొళ్ళు జల్లుమంది. "సంబడవోఁ నువ్వట్టా పిలవమనందే ..... " అంది కళ్ళు దించేసుకుని.

"పిలవ్వే" ఆశగా అన్నాడు బాబిగాడు.

కిష్ట నీళ్ళలో తలదించుకుని తనలో తను అనుక్నుట్టు "మావా" అంది. బాబి గుండె పొంగిపోయింది. సంబరంలో పోలి జడ లాగాడు. పోలి జడలో పున్నాగపూలు కిష్టలో జలజలా రాలి ప్రవాహంలో కొట్టుకొని పోతున్నాయి. పోలి, బాబి ఒకళ్ళ నొకళ్ళు నవ్వుతూ చూసుకుని ప్రవాహంలో పరుగెత్తుతున్న పున్నాగపూలు చూసుకుని కిష్టమ్మ తల్లికి దణ్ణం పెట్టుకున్నారు.

వొడ్డుకొచ్చాక బాబిగాడు జేబులోంచి టేపుతీసి పోలి చేతులు, నడుం, ఛాతి, మెడ కొలతలు తీసుకుంటుంటే "ఏంటిది?" అంది పోలి. "మనకి దర్జీ కొట్టో పనే" అంటూ గర్వంగా వెళ్ళిపోయాడు బాబిగాడు.

పోలికి కొత్త జాకెట్టు కుట్టివ్వాలి. ఎలా? బాబి మిగిలిన బట్టముక్కల్ని ఒకే రంగుగలవి దాచటం మొదలెట్టాడు. ఓ నెల రోజులకి బట్ట కుదిరింది. మరి కుట్టటం? తన్ని మిషనెక్క నివ్వరు. ఎవ్వరూ లేని సమయంలో మిషన్ ఎక్కి కుట్టటం మొదలెట్టాడు. ఈ సంగతి జోగారావుకి తెలిస్తే ఉద్యోగం తీసేస్తాడు. నెల రోజులకి చేతులు కుట్టాడు. ఇంకో నెలకి నడుం ... ఇలా సమయం దొరికినప్పుడల్లా రహస్యంగా కుట్టుకుంటూ ఆర్నెల్లకి జాకెట్టు పూర్తి చేశాడు.

కిష్టవొడ్డుకి పరుగెత్తుకొచ్చాడు బాబిగాడు.

"కొత్త జాకెట్టు" పసిపిల్లలా ఆనందంతో గెంతింది పోలి.

"తొడుక్కురాయే" అన్నాడు వీరుడులాగా బాబిగాడు. చింతచెట్టు చాటుకెళ్ళి జాకెట్టు తొడుక్కుని ఇవతలికొచ్చింది పోలి.

జాకెట్టు చాల్లేదు! గుండీలు కాజాలు కలవటం లేదు. ఆర్నెల్లలో పోలి ఛాతి పెరిగిపోయింది.

బిక్కమొహం వేసుకున్న బాబిగాడ్ని చూసి పోలి అంది "పోన్లే మావా! మా దొరసాని, ఒసే! పోలీ! నువ్వింకా పవిట్లేసుకోవాల, మా పిల్ల పాతవోణి యిస్తాను. రేపట్నించేసుకో అంది! పవిటేసుకుంటే పిన్నీసెట్టుకుంటాను. సరిపోద్దిలే."

బాబిగాడి కళ్ళలో కోరికల దీపాలు! *